
సాక్షి
యాదాద్రి భువనగిరి
బుధవారం, 16, అక్టోబర్, 2024



గుప్త నిధుల కోసం తవ్వకాలు?
కొండమల్లేపల్లి మండలం చింతచెట్టు తండా పరిధిలోని జేత్యతండాలో గుప్త నిధుల కోసం తవ్వకాలు జరిపారు. - 10లో



ఆర్టీసీకి కలిసొచ్చిన దసరా
దసరా నందర్భంగా ఉమ్మడి జిల్లాలోని 7 ఆర్టీసీ డిపోల ద్వారా రూ.12కోట్ల ఆదాయం లభించింది. - 10లో



అడ్డగోలు పార్కింగ్‌తో ఇబ్బందులు
భువనగిరి పట్టణంలో రోడ్లకు ఇరువైపులా వాహనాలు పార్కింగ్ చేస్తుండడంతో ట్రాఫిక్ జామ్ ఏర్పడుతోంది. - 11లో

న్యూస్‌రీల్

నేడు, రేపు నీటి సరఫరా నిలిపివేత

భువనగిరిటౌన్: తుర్కపల్లి టీఎల్‌బీఆర్ ట్యాంకు నుంచి భువనగిరి మండలానికి వచ్చే పైపులైన్ మరమ్మతుల కారణంగా తాగునీటి సరఫరాను బుధవారం, గురువారం రెండు రోజులు నిలిపివేయనున్నట్లు మిషన్ భగీరథ భువనగిరి డివిజన్ కార్యనిర్వాహణ ఇంజనీర్ కరుణాకరణ్ మంగళవారం తెలిపారు. భువనగిరి, ఆత్మకూర్, బీబీనగర్, మోటకొండూర్, వలిగొండ, రామన్నపేట, పోచంపల్లి, మండలాల ప్రజలు గమనించి నీటిని పొదుపుగా వాడుకోవాలని సూచించారు.

'విదేశీ విద్యానిధి'కి దరఖాస్తు గడువు పొడిగింపు

భువనగిరిటౌన్: 2024–25 విద్యా సంవత్సరానికిగాను అంబేద్కర్ విదేశీ విద్యానిధి పథకానికి దరఖాస్తుల స్వీకరణ ఈ నెల 29వ తేదీ వరకు పొడిగించినట్లు జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి జయపాల్‌రెడ్డి మంగళవారం తెలిపారు. ఎస్సీ కులాలకు చెందిన అర్హులైన విద్యార్థులు విదేశాల్లో ఉన్నత చదువులకు ఉపకార వేతనాల కోసం https://telanganaepass.gov.in ద్వారా దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు.

తాజా ఆహారపదార్థాలను అందించాలి



ఆహార పదార్థాలను పరిశీలిస్తున్న ఫుడ్ సేఫ్టీ అధికారులు

భువనగిరి: హోటల్స్ నిర్వాహకులు వినియోగదారులకు తాజా ఆహార పదార్థాలు అందించాలని ఫుడ్ సేఫ్టీ డిజిగ్నేటెడ్ ఆఫీసర్ స్వాతి అన్నారు. వినియోగదారుల ఫిర్యాదుల మేరకు మంగళవారం భువనగిరిలోని వివేరా హోటల్‌లో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. నిల్వ ఉంచిన ఆహార పదార్థాలను వాడకూడదన్నారు. ప్రజలకు అందించే ఆహారపదార్థాలు నాణ్యమైనవిగా ఉండాలని, లేకుంటే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అంతకుముందు హోటల్‌లోని వంట గది, స్టోర్ రూంలో ఉన్న కూరగాయలు, పప్పులు, నూనె పరిశీలించారు. నిర్ణీత గడువు దాటి నిల్వ ఉంచిన కూల్ డ్రింక్స్‌ను ధ్వంసం చేశారు. హోటల్‌లోని పలు రకాల శాంపిల్స్ సేకరించి హైదరాబాద్‌లోని ల్యాబ్‌కు పంపించారు.

ఎగ్జిబిషన్‌లో పుట్టపాక చేనేత వస్త్రాలు



ఎగ్జిబిషన్‌లో ఏర్పాటు చేసిన స్టాల్

సంస్థాన్ నారాయణపురం: రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో వరంగల్‌లో ఏర్పాటు చేసిన రాష్ట్ర హ్యాండ్లూమ్ ఎక్స్‌పో ఎగ్జిబిషన్‌లో మంగళవారం పుట్టపాక ఉమెన్స్ హ్యాండ్లూమ్ ఇక్కత్ ప్రొడక్ట్స్ ఆధ్వర్యంలో స్టాల్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా తేలియా రుమాల్ వస్త్రాలను ప్రదర్శనలో ఉంచారు. తెలంగాణ రాష్ట్ర పద్మశాలీ మహిళా సంఘం ఉపాధ్యక్షురాలు సామల విజయలక్ష్మి తదితరులున్నారు.

క్షేత్రపాలకుడికి ఆకుపూజ

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహ స్వామి వారి ఆలయంలో మంగళవారం శ్రీఆంజనేయస్వామికి అర్చకులు ఆకుపూజను విశేషంగా నిర్వహించారు. ప్రధానాలయంతో పాటు విష్ణు పుష్కరిణి వద్ద, పాతగుట్ట ఆలయంలో ఆంజనేయస్వామిని సింధూరం, పాలతో అభిషేకించారు. అనంతరం తమలపాకులతో అర్చించారు. ప్రధానాలయంలో నిత్య పూజలు సంప్రదాయంగా కొనసాగించారు. శ్రీసుదర్శన నారసింహ హోమం, గజవాహన సేవ, నిత్య కల్యాణం, బ్రహ్మోత్సవం జరిపించారు.

అప్పుడే పంచుతున్నారు!

రానున్న 'స్థానిక' ఎన్నికలకు ఓటర్లను ప్రసన్నం చేసుకునే పనిలో ఆశావహులు

- బతుకమ్మ పోటీల్లో బహుమతులు
- ఖర్చుకు వెనుకాడకుండా పండుగలకు పంపిణీ
- గ్రామ అభివృద్ధికి మేనిఫెస్టో కూడా విడుదల



సాక్షి, యాదాద్రి: మున్సిపాలిటీలు, గ్రామ పంచాయతీలకు రానున్న ఎన్నికల్లో పోటీ చేయాలనుకునే ఆశావహులు ఓటర్లను ప్రసన్నం చేసుకునే పనిలో పడ్డారు. పోటీ చేయాలనుకుంటున్న వారు ఖర్చుకు వెనుకాడడం లేదు. గణనాథుడి ఉత్సవాలు, బతుకమ్మ, దసరా పండుగ సందర్భంగా పెద్ద ఎత్తున ఖర్చు చేశారు. వినాయకుడి విగ్రహాలు, అన్నదానాలకు పెద్దమొత్తంలో చందాలు ఇచ్చారు. బతుకమ్మ పండుగ సందర్భంగా పోటీలు నిర్వహించి బహుమతులు, చీరలు పంపిణీ చేశారు. కొన్ని చోట్ల దసరాకు మద్యం, మటన్, చికెన్ పంపిణీ చేసి తాము పోటీలో ఉంటామన్న సంకేతాలిస్తున్నారు. కొందరు తమ సొంత ఖర్చులతో గోవా, మేడారం ట్రిప్‌కు తీసుకుపోతున్నారు. మరికొందరు అప్పుడే ఎన్నికల మేనిఫెస్టోను కూడా విడుదల చేస్తున్నారు. ఇదిలా ఉండగా.. బీసీ కుల గణన, రిజర్వేషన్లు మారుతాయన్న సంకేతాలతో పలువురు ఆచితూచి ఖర్చు చేస్తున్నారు.

- ఇటీవల రాజాపేట మండలంలో సర్పంచ్‌గా పోటీ చేయాలనుకున్న వ్యక్తి బతుకమ్మ పండుగకు మహిళలకు చీరలు పంపిణీ చేశారు. అయితే కొందరు యువకులు, గ్రామస్తులు సదరు నాయకుడికి ఫోన్ చేసి తమకు మద్యం కోసం డబ్బులు కావాలని కోరడంతో చేసేదేమీ లేక వారికి డబ్బులు ఇచ్చారు.
- ఆలేరు మున్సిపాలిటీలో రానున్న ఎన్నికల్లో కౌన్సిలర్‌గా పోటీ చేయాలనుకుంటున్న అధికార పార్టీకి చెందిన ఓ వ్యక్తి వార్డులోని వారందరికి చీరలు పంపిణీ చేశారు. స్థానిక ఎమ్మెల్యే బీర్ల ఐలయ్యను పిలిచి మరీ కార్యక్రమానికి చేపట్టారు.
- తుర్కపల్లి మండలం మల్కాపూర్ గ్రామానికి చెందిన కొడారి లత మల్లేష్‌లు సర్పంచ్ ఎన్నికల్లో పోటీ చేసేందుకు సిద్ధమవుతున్నారు. 14 హామీలతో కూడిన ఎన్నికల మేనిఫెస్టోను కూడా విడుదల చేశారు.
- సాయిగూడెం గ్రామ పంచాయతీ సర్పంచ్ పదవి కోసం తీవ్ర పోటీ నెలకొంది. కొందరు యువకులు సర్పంచ్‌గా పోటీ చేయడానికి రంగం సిద్ధం చేసుకుంటున్నారు. బతుకమ్మ, దసరా పండుగ సందర్భంగా పోటీ పోటీగా ఖర్చు చేశారు.
- భువనగిరి మున్సిపాలిటీలో వార్డు కౌన్సిలర్‌గా పోటీ చేసి గెలుపొందడానికి ఖర్చుకు వెనుకాడడం లేదు. వినాయక నవరాత్రుల సందర్భంగా వార్డులో ఏర్పాటు చేసిన మండపాలకు డీజే సౌండ్ బాక్స్‌లు పంపిణీ చేశారు. ఇంకా అవసరం కోసం వచ్చే వారికి ఆర్థిక సాయం చేస్తున్నారు.

ధాన్యం కొనుగోళ్లలో పొరపాట్లు చేయొద్దు



మాట్లాడుతున్న కలెక్టర్ హనుమంతు కె. జెండగే

- కలెక్టర్ హనుమంతు కె. జెండగే

సాక్షి,యాదాద్రి: వానాకాలం (ఖరీఫ్) సీజన్‌కుగాను వరి ధాన్యం (సన్న రకం, దొడ్డు రకం) కొనుగోళ్లలో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా సక్రమంగా నిర్వహించాలని కలెక్టర్ హనుమంతు కె. జెండగే సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో రెవెన్యూ అదనపు కలెక్టర్ బెన్ షాలోమ్‌తో కలిసి ధాన్యం కొనుగోళ్లపై ఏఈఓలు, డీపీఎంలు, ఏపీఎంలు కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు, కమ్యూనిటీ కో–ఆర్డినేటర్ లకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో నాలుగు లక్షల మెట్రిక్ టన్నుల వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలకు రానుందన్నారు. 369 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. అందులో 322 కేంద్రాలు దొడ్డు రకం, 47 కేంద్రాలు సన్న రకం సేకరణకు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ప్రభుత్వం మొదటిసారిగా సన్న రకం ధాన్యంపై రూ. 500 బోనస్ ఇవ్వనున్నట్లు తెలిపారు. గ్రేడ్.ఏ ధాన్యానికి క్వింటాకు రూ.2,320, సాధారణ రకానికి రూ.2,300 మద్దతు ధర ప్రకటించిందన్నారు. కేంద్రాల్లో సన్న, దొడ్డు రకానికి వేర్వేరుగా రికార్డులను నిర్వహించాలన్నారు. ఐకేపీ సెంటర్లలో రైతులకు అనుగుణంగా ఏర్పాట్లు చేయాలన్నారు. గన్నీ బ్యాగులు, టార్పాలిన్లు, దయల్ గ్రెయిన్ క్యాలిబర్‌లు, చెక్ పోస్టులు, టోకెన్‌ల జారీ, వేయింగ్ మెషిన్లు, ప్యాడీ క్లీనర్ల ఏర్పాటుకు అన్ని చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ బేన్‌షాలోమ్, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి నాగిరెడ్డి ,రెవిన్యూ డివిజనల్ అధికారి అమరేందర్,డీసీఎస్ఓ వనజాత , డీఎం సిఎస్ జగదీష్ కుమార్ ,డి పి ఎమ్ సునీల్ రెడ్డి సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

రైతుల కోసం టోల్‌ఫ్రీ నంబర్

వానాకాలం ధాన్యం కొనుగోలు నేపథ్యంలో రైతుల కోసం టోల్‌ఫ్రీ నంబర్ ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ తెలిపారు. ఏమైనా సమస్యలు తలెత్తితే రైతులు లేదా ఇతరులు 79951 20554కు ఫోన్ చేసి తెలియజేయాలన్నారు. సంబంధిత అధికారులు సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటారని పేర్కొన్నారు.

ధాన్యం సేకరణ సాఫీగా చేయాలి

కలెక్టరేట్‌లో ధాన్యం కొనుగోలుకు సంబంధించి ఆయా శాఖల అధికారులు, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల సీఈఓలు, పీపీసీ సెంటర్ ఇన్‌చార్జ్‌లు, ట్యాబ్ ఎంట్రీ అపరేటర్లతో సమావేశం నిర్వహించారు. రైతులు ఇబ్బందులకు గురికాకుండా, పూర్తిగా పారదర్శకంగా ధాన్యం సేకరణ జరగాలని కలెక్టర్ హనుమంతు కె. జెండగే సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ బెన్ షాలోమ్, జిల్లా కోఆపరేటివ్ అధికారి శ్రీధర్, జిల్లా సహకార ఆడిట్ అధికారి ప్రవీణ్ కుమార్, జిల్లా వ్యవసాయ అధికారి గోపాల్, వనజాత, జగదీష్ కుమార్ పాల్గొన్నారు.

అద్దె 'గురుకులానికి' తాళం

- పేరుకుపోయిన భవనాల అద్దెలు
- వెంటనే చెల్లించాలంటున్న యజమానులు
- మోత్కూర్‌లో గేటుకు తాళం వేసిన భవన యజమాని
- పాఠశాల ఎదుట ఆరు గంటలపాటు ఉపాధ్యాయులు, విద్యార్థుల నిరీక్షణ



మోత్కూరులోని బాలుర గురుకుల పాఠశాల గేట్ ఎదుట నిరీక్షిస్తున్న ఉపాధ్యాయులు

సాక్షి,యాదాద్రి, మోత్కూరు: పేరుకుపోయిన అద్దెలు చెల్లించాలని గురుకుల పాఠశాలల భవన యజమానులు డిమాండ్ చేస్తున్నారు. అద్దె చెల్లించకుంటే ఖాళీ చేయాలని, లేదంటే తాళం వేస్తామని హెచ్చరిస్తున్నారు. జిల్లాలో గురుకుల పాఠశాల ఏర్పాటుకు సొంత భవనాలు లేకపోవడంతో 13 అద్దె భవనాలను తీసుకుని అందులోనే పాఠశాలలను కొనసాగిస్తున్నారు. కానీ 10 నెలలుగా భవనాల అద్దె పెండింగ్‌లో ఉంది. ఈ క్రమంలో మోత్కూరు మున్సిపల్ కేంద్రంలోని సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాలల భవనానికి ప్రభుత్వం అద్దె చెల్లించడం లేదని భవన యజమాని సీహెచ్ సత్యంగౌడ్ మంగళవారం ఉదయం పాఠశాల గేటుకు తాళం వేశాడు. తొమ్మిది నెలలుగా భవనానికి అద్దె చెల్లించడం లేదని, సుమారు రూ.24లక్షలు పెండింగ్‌లో ఉన్నాయని, గత మూడు నెలలుగా స్థానిక ప్రిన్సిపాల్, జోనల్ ఆఫీసర్, కమిషనర్ దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకపోయిందని పేర్కొన్నాడు. ఈ సమాచారాన్ని ప్రిన్సిపాల్ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. సుమారు 20 మంది ఉపాధ్యాయులు, పది మంది విద్యార్థులు 6 గంటల పాటు పాఠశాల గేటు ఎదుట నిరీక్షించారు. స్థానిక ఎస్ఐ నాగరాజు, తహసీల్దార్ రాంప్రసాద్, మండల స్పెషల్ ఆఫీసర్ యాదయ్య, అక్కడికి చేరుకున్నారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని చెప్పినా భవన యజమాని వినిపించుకోలేదు. ఎట్టకేలకు ప్రభుత్వం గురుకుల పాఠశాలల అద్దె భవనాల బకాయిలు చెల్లిస్తామని ప్రకటించిందని హామీ ఇవ్వడంతో భవన యజమాని గేటు తాళం తీశాడు. వచ్చిన విద్యార్థులకు భోజనాలు తయారు చేసి పెట్టించామని ప్రిన్సిపాల్ శారద తెలిపారు.

జిల్లాలో ఇలా..

- జిల్లాలో మూడు మైనార్టీ గురుకులాలు అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. ఒక్కో గురుకుల భవనానికి ఆరు నెలల నుంచి రావాల్సిన బకాయిలు మొత్తం రూ. 42లక్షలు పెండింగ్‌లో ఉన్నాయి.
- ఆరు బీసీ గురుకులాలు అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. వీటికి ఐదు నుంచి ఆరు నెలల బకాయి రావాల్సి ఉంది. సుమారు రూ 1.5 లక్షల వరకు అద్దె చెల్లించాల్సి ఉంది.
- ఎస్సీ గురుకుల పాఠశాలలు ఎనిమిది ఉండగా ఇందులో నాలుగు అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. రూ. 80లక్షల వరకు అద్దె చెల్లించాల్సి ఉంది.

పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచాలి

- డీఈఓ సత్యనారాయణ

మోటకొండూర్: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచాలని డీఈఓ సత్యనారాయణ అన్నారు. మంగళవారం మోటకొండూర్ మండలం ముత్తిరెడ్డిగూడెం గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలను ఆయన తనిఖీ చేశారు. ప్రైమరీ, జెడ్పీ పాఠశాల విద్యార్థులతో మాట్లాడారు. మధ్యాహ్న భోజన రికార్డులను పరిశీలించారు. భోజనం రుచి చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం పాఠశాలలో కల్పిస్తున్న వసతులు, మధ్యాహ్న భోజనం, విద్యార్థుల సంఖ్య, ఉపాధ్యాయుల సిబ్బంది గురించి అడిగి తెలుసుకున్నారు. 9, 10 తరగతుల విద్యార్థులతో మాట్లాడి వారి విద్యాసామర్థ్యాలు తెలుసుకున్నారు. అదేవిధంగా ఉపాధ్యాయులతో సమావేశమయ్యారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించాలన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ఎండీ గఫార్, రజిత పాల్గొన్నారు.

కొరటికల్ జెడ్పీ ఉన్నత పాఠశాల తనిఖీ

ఆత్మకూరు(ఎం): ఆత్మకూరు(ఎం) మండలం కొరటికల్ గ్రామంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలను జిల్లా విద్యాశాఖ అధికారి కందుల సత్యనారాయణ మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల రికార్డులను, మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యతతో కూడిన భోజనం అందించాలని వంట ఏజెన్సీకి సూచించారు. 9, 10 తరగతి విద్యార్థుల విద్యా సామర్థ్యాలను పరిశీలించారు. ఆయన వెంట ప్రధానోపాధ్యాయుడు వెంకన్న, ఉపాధ్యాయులు రవి, వరప్రసాద్, శ్రీనువాసచారి, అనురాధ, వెంకటేశం తదితరులు ఉన్నారు.



ముత్తిరెడ్డిగూడెం గ్రామంలో ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న డీఈఓ సత్యనారాయణ

ప్రతిఘటించకుంటే భవిష్యత్ ప్రశ్నార్థకమే



సిమెంట్ పరిశ్రమ ఏర్పాటు వ్యతిరేక సదస్సులో అభివాదం చేస్తున్న అఖిలపక్ష నాయకులు

- రిటైర్డ్ లెక్చరర్ రామచంద్రయ్య
- రామన్నపేటలో కాలుష్య కారక సిమెంట్ పరిశ్రమ ఏర్పాటు వ్యతిరేక సదస్సు

రామన్నపేట: కాలుష్య కారక పరిశ్రమ ఏర్పాటును ప్రజలు ప్రతిఘటించకుంటే భవిష్యత్ ప్రశ్నార్థకమవుతుందని ఎన్ఐటీ(నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ) రసాయనశాస్త్రం రిటైర్డ్ లెక్చరర్ రామచంద్రయ్య అన్నారు. మంగళవారం రామన్నపేటలో నిర్వహించిన కాలుష్య కారక సిమెంట్ పరిశ్రమ ఏర్పాటు వ్యతిరేక సదస్సులో ఆయన మాట్లాడారు. సిమెంట్ పరిశ్రమ నుంచి వచ్చే ఫెర్రస్, సిలికేట్లు, క్లోనేట్స్ వల్ల ఉపిరితిత్తులు, శ్వాసకోశ సంబంధిత వ్యాధులు సంభవిస్తాయని తెలిపారు. పంటపొలాలు సిమెంట్ ధూళితో నిండి సాగుకు పనికి రాకుండా పోతాయన్నారు. ఈ నెల 23న జరిగే ప్రజాభిప్రాయ సేకరణలో పరిశ్రమ ఏర్పాటును ముక్తకంఠంతో వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. పట్టణ ప్రాంత అభివృద్ధి కమిటీ రాష్ట్ర కార్యదర్శి డీజీ నర్సింహరావు మాట్లాడుతూ.. సిమెంట్ పరిశ్రమలు ఏర్పాటు చేసిన ప్రాంతాలు ఎలాంటి అభివృద్ధికి నోచుకోలేదన్నారు. సీపీఎం జిల్లా కార్యదర్శి ఎండీ జహంగీర్ మాట్లాడుతూ.. సిమెంట్ పరిశ్రమతో వ్యవసాయం, చేనేత, పాడి పరిశ్రమలు దెబ్బతింటాయని, మత్స్యకారులు, జీవాల పెంపకం దారులు నష్టపోతారన్నారు. సిమెంట్ పరిశ్రమ ప్రతినిధులు ప్రజలను తప్పుదోవ పట్టించడానికి చేసే కుట్రలను తిప్పికొట్టాలన్నారు. ఈనెల 16 నుంచి 20వ తేదీ వరకు గ్రామాల్లో నిరసన కార్యక్రమాలు నిర్వహించాలని, 23న జరిగే ప్రజాభిప్రాయ సేకరణను ప్రతిఘటించాలని తీర్మానించారు. సదస్సులో పర్యావరణ పరిరక్షణ వేదిక కన్వీనర్ జెల్లెల పెంటయ్య, కోకన్వీనర్ ఎండీ రెహాన్ పీఏసీఎస్ చైర్మన్ నంద్యాల భిక్షంరెడ్డి, వివిధ పార్టీల నాయకులు మేక అశోక్‌రెడ్డి, గంగుల వెంకటరాజిరెడ్డి, సిరిగిరెడ్డి మల్లారెడ్డి, దుర్గయ్య, మల్లేశం , నర్సింహ, వెంకటేశం, నరేందర్, రాజు, గణేష్, ఫజల్‌బేగ్, ప్రభాకర్, పృథ్వీరాజు, మాధవరెడ్డి, చంద్రశేఖర్, అశోక్, హన్మంత్, ఎండీ జమీరొద్దీన్, ఉపేందర్, శివ, శ్రీనివాస్, గోపాల్ పాల్గొన్నారు.



సదస్సుకు హాజరైన ప్రజలు

ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి



భువనగిరిలో ర్యాలీ నిర్వహిస్తున్న ప్రైవేట్ డిగ్రీ, పీజీ కళాశాలల యాజమాన్యాలు, అధ్యాపకులు

- ప్రైవేట్ డిగ్రీ, పీజీ కళాశాలల మేనేజ్‌మెంట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ర్యాలీ

భువనగిరి: ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ ప్రైవేట్ డిగ్రీ, పీజీ కళాశాలల మేనేజ్‌మెంట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో చేపట్టిన నిరవధిక బంద్‌లో భాగంగా భువనగిరి పట్టణంలో రెండో రోజు మంగళవారం కళాశాలల బంద్ కొనసాగింది. స్థానిక బాబు జగ్జీవన్‌రామ్ చౌరస్తా నుంచి అంబేద్కర్ చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో జాగృతి, నవ భారత్ డిగ్రీ మరియు పీజు కళాశాలల యాజమాన్యం, అధ్యాపకులు ఎస్‌బీ మల్లేశం, ప్రభాకర్, మణిపాల్‌రెడ్డి, ప్రవీణ్‌కుమార్, అధ్యాపకులు నవీన్‌కుమార్, కర్తాల శ్రీనివాస్, బాలేశ్వర్, సంతోష్, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

కొత్త టీచర్లకు ముగిసిన కౌన్సిలింగ్

- తొలుత కౌన్సిలింగ్‌ను తాత్కాలికంగా వాయిదా వేస్తున్నట్లు విద్యాశాఖ సందేశం
- మధ్యాహ్నం సమయంలో తిరిగి కౌన్సిలింగ్ నిర్వహించాలని ఆదేశాలు
- కేంద్రానికి చేరుకున్న ఉపాధ్యాయులు
- రాత్రి 10 గంటల వరకు కొనసాగిన కౌన్సిలింగ్



కౌన్సిలింగ్‌కు హాజరైన నూతన ఉపాధ్యాయులు

భువనగిరి: డీఎస్సీ– 2024 ద్వారా ఎంపికై నియామక పత్రాలను స్వీకరించిన నూతన ఉపాధ్యాయులకు మంగళవారం భువనగిరిలోని వెన్నెల కళాశాలలో స్కూళ్ల కేటాయింపు కౌన్సిలింగ్ ప్రక్రియ నిర్వహించారు. మంగళవారం కౌన్సిలింగ్ నిర్వహిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారులు అభ్యర్థులకు సమాచారం అందించారు. దీంతో ఉదయం 7 గంటలకే కేంద్రాలకు చేరుకున్నారు. అయితే ఉదయం 8.30 గంటలకు కొత్త టీచర్ల పోస్టింగ్ కౌన్సిలింగ్ తాత్కాలికంగా వాయిదా వేస్తున్నట్లు రాష్ట్ర విద్యాశాఖ డీఈఓలకు సందేశం పంపింది. దీంతో అధికారులు వచ్చిన అభ్యర్థులతో సంతకాలు తీసుకుని తిరిగి పంపించారు. అనంతరం మధ్యాహ్నం 12.30 గంటలకు రాష్ట్ర విద్యాశాఖ నుంచి తిరిగి కౌన్సిలింగ్ నిర్వహించాలని ఆదేశాలు రావడంతో అధికారులు మళ్లీ అభ్యర్థులకు సమాచారం ఇచ్చారు. దీంతో వారంతా కేంద్రాలకు చేరుకున్నారు.

నేడు పాఠశాలల్లో చేరిక

డీఎస్సీ–2024 ద్వారా ఎంపికై నియామక పత్రాలు స్వీకరించిన వారిలో 252 మంది ఉపాధ్యాయులు ఉన్నారు. ఇందులో అన్ని రకాల స్కూల్ అసిస్టెంట్లు 85 మంది, అన్ని రకాల ఎస్జీటీకు సంబంధించి 167 మంది ఉన్నారు. ముందుగా నిర్వహించిన ఎస్ఏ, భాషాపండితులు, పీఈటీలకు సంబంధించి 84 మంది హాజరుకాగా.. వీరికి కౌన్సిలింగ్ ద్వారా పాఠశాలల కేటాయింపు పూర్తి కాగా.. ఒకరు గైర్హాజరయ్యారు. వీరికి మిగిలిన ఖాళీ పోస్టును కేటాయించనున్నారు. అదేవిధంగా 167 ఎస్జీటీ పోస్టులకు ఎంపికైన వారు కౌన్సిలింగ్‌కు హాజరయ్యారు. వీరందరికి మెరిట్ కమ్ రోస్టర్ ప్రకారం పాఠశాలలను కేటాయించారు. పాఠశాలల కేటాయింపు అనంతరం వారికి ఆర్డర్ కాపీలను అందజేశారు. వీరంతా బుధవారం ఆయా పాఠశాలల్లో చేరనున్నారు.

విద్యాశాఖ సూచించిన వారికి రిపోర్టు చేయాలి

భువనగిరి: కౌన్సిలింగ్ ద్వారా పోస్టింగ్ పొందిన నూతన ఉపాధ్యాయులు తమ ఉత్తర్వులను జిల్లా విద్యాశాఖ సూచించిన వారికి బుధవారం రిపోర్టు చేయాలని డీఈఓ సత్యనారాయణ మంగళవారం తెలిపారు. స్కూల్ అసిస్టెంట్లు సమాన స్థాయి ఉపాధ్యాయులు సంబంధిత ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు ప్రాథమికోన్నత పాఠశాలల్లో పోస్టింగ్ పొందిన వారు సంబంధిత ఎంఈఓలు, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులకు, ఎస్జీటీ సమాన స్థాయి ఉపాధ్యాయులు సంబంధిత కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులకు రిపోర్టు చేయాలని పేర్కొన్నారు.

రాత్రి 10 గంటల వరకు కౌన్సిలింగ్..

ముందుగా ప్రకటించిన ప్రకారం ఉదయం 10 గంటలకు ఎస్ఏలు, భాషపండితులు, పీఈటీలకు, మధ్యాహ్నం ఒంటి గంటకు ఎస్జీటీకు కౌన్సిలింగ్ నిర్వహించాలని నిర్ణయించారు. కానీ కౌన్సిలింగ్ వాయిదా పడటం వల్ల తిరిగి మధ్యాహ్నం తర్వాత ఎస్ఏ, భాషపండితులు, పీఈటీలకు కౌన్సిలింగ్ ప్రారంభించి సాయంత్రం వరకు కొనసాగించారు. రాత్రి 7 గంటల తర్వాత ఎస్జీటీలకు కౌన్సిలింగ్ ప్రక్రియ మొదలు పెట్టారు. దీంతో ఈ ప్రక్రియ రాత్రి 10 గంటల వరకు జరిగింది.

నిధుల విడుదలకు మంత్రి హామీ



మంత్రి ఉత్తమ్‌ను కలిసిన ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌రెడ్డి, ఇతర నాయకులు

- ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌రెడ్డి

సాక్షి, యాదాద్రి: బునాదిగాని కాలువ, చెక్‌డ్యాంలకు, బీఎన్ తిమ్మాపూర్ గ్రామ ముంపు పరిహారానికి నిధులు మంజూరు చేస్తానని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి హామీ ఇచ్చినట్లు భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్ రెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డితోపాటు నీటిపారుదల శాఖ అధికారులను కలిసినట్లు ఆయన తెలిపారు. బునాదిగాని, పిల్లాయపల్లి, ధర్మారెడ్డి కాలువలకు నిధులు మంజూరు చేయాలని, బస్వాపూర్ రిజర్వాయర్ ముంపు గ్రామాల ప్రజలకు నష్ట పరిహారం వెంటనే చెల్లించాలని, చిన్నేరు వాగుపై వడపర్తి, అనాజిపురం, బొల్లేపల్లి, మాదారం వద్ద చెక్ డ్యాంలు నిర్మించాలని కోరినట్లు చెప్పారు. పెండింగ్‌లో ఉన్న పిల్లాయపల్లి, ధర్మారెడ్డి కాలువల నిధులు కూడా మంజూరు చేయిస్తానని మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి తెలిపారని చెప్పారు. అదేవిధంగా బొల్లేపల్లి, భీమలింగం, అలీనగర్‌కాల్వల అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని మైనర్ ఇరిగేషన్ ఈఎన్‌సీ చంద్రశేఖర్, డిప్యూటీ ఈఎన్‌సీ శ్రీనివాస్‌లను కలిసి కోరినట్లు కుంభం అనిల్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు.

క్లుప్తంగా

కారు ఢీకొని బాలుడి మృతి


బెక్కం శ్రీరాం (ఫైల్)

గరిడేపల్లి: కారు ఢీకొని బాలుడు మృతి చెందాడు. ఈ ఘటన గరిడేపల్లి మండలం రాయినిగూడెం గ్రామంలో మంగళవారం జరిగింది. ఎస్ఐ నరేష్ తెలిపిన వివరాల ప్రకారం.. రాయినిగూడెం గ్రామానికి చెందిన బెక్కం శ్రీరాం(11), తన అమ్మమ్మ వెంకటలక్ష్మితో కలిసి తన తమ్ముడు సాయిరాంను స్కూల్ బస్ ఎక్కించి రోడ్డు దాటుతుండగా గరిడేపల్లి నుంచి హుజూర్‌నగర్ వైపు వస్తున్న కారు శ్రీరాంను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో శ్రీరాం తలకు, రెండు మోకాళ్లకు గాయాలయ్యాయి. వెంటనే అతడిని చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుని తండ్రి బెక్కం అశోక్‌కుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

యువకుడి అదృశ్యం


లింగరాజు

పెన్‌పహాడ్: అత్తగారింటికి వెళ్తానని చెప్పి ఇంటి నుంచి బయల్దేరిన యువకుడు అదృశ్యమయ్యాడు. ఈ ఘటన పెన్‌పహాడ్ మండల పరిధిలోని సింగారెడ్డిపాలెం గ్రామంలో జరిగింది. ఎస్ఐ రవీందర్ తెలిపిన వివరాల ప్రకారం.. సింగారెడ్డిపాలెం గ్రామానికి చెందిన పచ్చిపాల లింగరాజు(25) ఈ నెల 13న చివ్వెంల మండలం తిమ్మాపురం గ్రామంలోని తన అత్తగారింటికి వెళ్తున్నానని చెప్పి ఇంటి నుంచి బయల్దేరాడు. కానీ అతడు అత్తగారింటికి వెళ్లలేదు. లింగరాజు కోసం ఎంత వెతికినా ఆచూకీ లభించకపోవడంతో అతడి తండ్రి మల్లయ్య మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

నేడు మార్కెట్ కమిటీల ప్రమాణ స్వీకారం

హాలియా: నాగార్జునసాగర్ నియోజకవర్గ పరిధిలోని హాలియా, నిడమనూరు వ్యవసాయ మార్కెట్ కమిటీల పాలకవర్గం బుధవారం ప్రమాణ స్వీకారం చేయనుంది. హాలియా వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా పెద్దవూర మండలం చలకుర్తి గ్రామానికి చెందిన తుమ్మలపల్లి చంద్రశేఖర్‌రెడ్డి, వైస్ చైర్మన్‌గా తిరుమలగిరి (సాగర్) మండలం బోయగూడెం గ్రామానికి చెందిన కలసాని చంద్రశేఖర్, నిడమనూరు మార్కెట్ కమిటీ చైర్మన్‌గా మండలం పార్వతీపురం గ్రామానికి చెందిన అంకతి సత్యనారాయణ(సత్యం), వైస్ చైర్మన్‌గా త్రిపురారం మండలం దుగ్గెపల్లి గ్రామానికి చెందిన బుసిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డితో పాటు డైరెక్టర్లు, మార్కెటింగ్ అధికారులు ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ఈ ప్రమాణస్వీకార కార్యక్రమానికి మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, మాజీ మంత్రి కుందూరు జానారెడ్డి హాజరు కానున్నారు. నిడమనూరు మండల కేంద్రంలోని బాలాజీ గార్డెన్‌లో ఉదయం 11 గంటలకు, హాలియా పట్టణంలోని లక్ష్మినర్సింహ గార్డెన్‌లో మధ్యాహ్నం 3.30 గంటలకు ప్రమాణ స్వీకార కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

ఆర్టీసీకి కలిసొచ్చిన దసరా

- పండుగకు ఉమ్మడి జిల్లాలో రూ.12 కోట్ల ఆదాయం
- మహాలక్ష్మి పథకం ద్వారా ప్రభుత్వం నుంచి మరో రూ.12 కోట్లు
- 645 ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించిన 36,24,000 మంది ప్రయాణికులు
- ఇందులో 22లక్షల మంది మహిళా ప్రయాణికులే


నల్లగొండ బస్టాండ్‌లో ప్రయాణికుల రద్దీ (ఫైల్)

నల్లగొండ రూరల్: ఆర్టీసీకి దసరా బోనాంజా లభించింది. పండుగ సందర్భంగా ఉమ్మడి నల్ల గొండ జిల్లాలోని 7 ఆర్టీసీ డిపోల ద్వారా ఈ నెల 1వ తేదీ నుంచి 14వ తేదీ వరకు 645 బస్సులను నడిపించగా.. 36,24,000 మంది ప్రయాణికులు రాకపోకలు సాగించారు. ఎక్కువగా హైదరాబాద్ నుంచి జిల్లా, పట్టణ కేంద్రాలకు బస్సులను నడిపించారు. 14,14,000 మంది టికెట్ కొనుగోలు చేశారు. దీని ద్వారా ఆర్టీసీకి రూ.12కోట్ల ఆదాయం లభించింది. 22లక్షల మంది మహిళా ప్రయాణికులు మహాలక్ష్మి పథకం ద్వారా ఉచితంగా బస్సుల్లో ప్రయాణం చేశారు. దీంతో ప్రభుత్వం నుంచి మరో రూ.12కోట్ల ఆదాయం ఆర్టీసీకి సమకూరనుంది. సాధారణంగా ఒక రోజుకు ఉమ్మడి జిల్లా పరిధిలో 645 బస్సులను 2,55,000 కిలోమీటర్లు నడుపుతూ 3లక్షల మంది ప్రయాణికులను గమ్యస్థానాలకు చేర్చేవారు. 3లక్షల మందిలో 65శాతం మహిళా ప్రయాణికులు ఉండేవారు. కాగా ఈ 14 రోజుల్లో 645 బస్సులను 35,19,000 కిలోమీటర్ల దూరం నడిపించినట్లు ఆర్టీసీ అధికారులు తెలిపారు.

స్పెషల్ బాదుడుతో వివాదం..

స్పెషల్ బస్సుల పేరిట చార్జీలు పెంచారని చాలా చోట్ల ప్రయాణికులు ఆర్టీసీ సిబ్బంది, అధికారులతో వాగ్వాదానికి దిగారు. ఎలాంటి ముందస్తు ప్రకటన లేకుండా చార్జీలు ఎలా పెంచుతారని ఆర్టీసీ అధికారులను ప్రయాణికులు నిలదీశారు. స్పెషల్ బస్సులు నడిపి సగటున సాధారణ టికెట్‌పై రూ.30 అదనంగా వసూలు చేయడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బంది పడ్డారు. స్పెషల్ బస్సుల్లో టికెట్ భారం మోయలేని పేదలు సాధారణ బస్సుల్లో వెళ్లేందుకే మొగ్గు చూపారు. గంటల కొద్ది బస్సుల కోసం నిరీక్షించారు. రద్దీకి తగ్గట్లుగా బస్టాండ్లలో కనీసం తాగునీటి సౌకర్యం కల్పించలేదని, స్టాళ్లలో ధరలు పెంచి తినుబండారాలు విక్రయించారని ప్రయాణికులు వాపోయారు. ఆదాయం పెంచుకోవడం పైనే దృష్టిసారించిన ఆర్టీసీ అధికారులు ప్రయాణికుల సౌకర్యాలను విస్మరించారన్న ఆరోపణలు వినిపించాయి.

ఫోర్బ్స్ ఇండియా డిజిటల్ స్టార్‌గా కొమిరెల్లి ఆకాంక్ష

- 86వ స్థానం దక్కించుకున్న మాధవ ఎడవల్లికి చెందిన యువతి


కొమిరెల్లి ఆకాంక్ష

నార్కట్‌పల్లి: మండలంలోని మాధవ ఎడవల్లి గ్రామానికి చెందిన కొమిరెల్లి అనంతరెడ్డి, మమత దంపతుల మూడో కుమార్తె కొమిరెల్లి ఆకాంక్ష మంగళవారం ఫోర్బ్స్ ఇండియా ప్రకటించిన టాప్–100 డిజిటల్ స్టార్స్–2024 జాబితాలో 86వ స్థానం దక్కించుకుంది. ఫ్యాషన్, లైఫ్‌స్టైల్ కంటెంట్ క్రియేటర్ అయిన ఆకాంక్ష యూట్యూబ్, ఇన్‌స్టాగామ్ వంటి సామాజిక మాధ్యమాలలో 3లక్షలకు పైగా ఫాలోవర్స్‌ను కలిగి ఉంది. ఆమె కుటుంబ సభ్యులు గత 25 సంవత్సరాలుగా హైదరాబాద్‌లోని ఎల్‌బీ నగర్‌లో నివాసముంటున్నారు. ఆమె 1వ తరగతి నుంచి ఇంటర్ వరకు హైదరాబాద్‌లో, బీటెక్ పూణెలోని సింబయాసిస్ కాలేజీలో పూర్తిచేసింది. ఆమె జాన్, మింత్రా, నైకా, లోరియల్ వంటి ప్రముఖ ఈకామర్స్, మేకప్ ప్రాడక్ట్స్ బ్రాండ్‌లతో కలిసి ఆకాంక్ష పనిచేసినట్లు ఆమె తండ్రి అనంతరెడ్డి తెలిపారు.

అనారోగ్య సమస్యలతో మత్స్యకారుడి ఆత్మహత్య


యాదయ్య (ఫైల్)

భూదాన్‌పోచంపల్లి: అనారోగ్య సమస్యలతో పాటు ఆర్థిక ఇబ్బందులతో మనస్తాపం చెంది మత్స్యకారుడు ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన మంగళవారం మధ్యాహ్నం పోచంపల్లి పట్టణ కేంద్రంలోని గాంధీనగర్‌లో జరిగింది. ఎస్ఐ భాస్కర్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. పోచంపల్లి పట్టణంలోని గాంధీనగర్‌కు చెందిన చెక్క యాదయ్య(60) కొంతకాలంగా కడుపునొప్పితో పాటు ఇతర అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నాడు. ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స చేయించుకోవడానికి తగిన ఆర్థిక స్థోమత లేక తీవ్ర మనస్తాపానికి గురయ్యాడు. మంగళవారం ఉదయం యాదయ్య భార్య హంసమ్మ కూలీ పనికి వెళ్లగా.. ఇంట్లో ఒంటరిగా ఉన్న అతడు తలుపులు మూసి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కూలి పనికి వెళ్లిన హంసమ్మ మధ్యాహ్నం ఇంటికి వచ్చి తలుపులు తెరిచిచూడగా యాదయ్య ఉరేసుకుని కన్పించాడు. వెంటనే కేకలు వేస్తూ ఇరుగుపొరుగు వారి సహాయంతో కిందికి దించిచూడగా అప్పటికే యాద య్య మృతిచెంది ఉన్నాడు. పోలీసులకు సమాచారం ఇవ్వగా వారు ఘటనా స్థలానికి చేరుకొని పంచనామా నిర్వహించారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం భువనగిరి ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. మృతుడికి ఇద్దరు వివాహితులైన కుమార్తెలు ఉన్నారు.

మా కుమార్తెను కిడ్నాప్ చేశారు

- పాల్వాయి స్రవంతిరెడ్డిపై ఆమె సోదరుడి ఆరోపణలు
- తమ కుమార్తెను అప్పగించాలని చండూరు చౌరస్తాలో ధర్నా


పోలీసులతో మాట్లాడుతున్న శ్రవణ్‌రెడ్డి దంపతులు

చండూరు: తమ కుమార్తెను తన చెల్లి, బీఆర్ఎస్ నాయకురాలు పాల్వాయి స్రవంతిరెడ్డి కిడ్నాప్ చేయించిందని ఆమె సోదరుడు పాల్వాయి శ్రవణ్‌కుమార్‌రెడ్డి దంపతులు ఇడికూడ గ్రామానికి చెందిన కొంతమందితో కలిసి మంగళవారం రాత్రి చండూరు చౌరస్తాలో ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా శ్రవణ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ.. సెప్టెంబర్ 11వ తేదీ రాత్రి ఇంట్లో తాము నిద్రించిన సమయంలో తమ కుమార్తెను పాల్వాయి స్రవంతిరెడ్డి కిడ్నాప్ చేయించిందని ఆరోపించారు. ఇదే విషయమై మరుసటిరోజు చండూరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. అదే నెల 13వ తేదీన నల్లగొండ డీఎస్పీ కార్యాలయానికి తమ కుమార్తెను పాల్వాయి స్రవంతిరెడ్డి తీసుకొచ్చి కోర్టులో హాజరు పర్చిందని తెలిపారు. పోలీసులు కూడా పాల్వాయి స్రవంతికే వత్తాసు పలుకుతున్నారని, కిడ్నాప్ కేసును సివిల్ కేసుగా మార్చుతున్నారని ఆయన పోలీసులపై ఆరోపణలు చేశారు. తన కుమార్తెను ఎవరు కిడ్నాప్ చేశారనే విషయంపై పోలీసులు విచారణ చేయకుండా గోప్యంగా ఉంచుతున్నారని పేర్కొన్నారు. బాలిక చైల్డ్ వెల్ఫేర్ అధికారుల సంరక్షణలో ఉందని, తగిన న్యాయం చేస్తామని చండూరు సీఐ వెంకటయ్య హామీ ఇవ్వడంతో ధర్నా విరమించారు.

ప్రజా శాంతికి భంగం కలిగించినందుకు కేసు నమోదు

మిర్యాలగూడ అర్బన్: మిర్యాలగూడ పట్టణంలోని రాజీవ్‌చౌక్ కూడలిలో సోమవారం సాయంత్రం నడిరోడ్డుపై బర్త్‌డే వేడుకలు నిర్వహించిన చిలుకూరి బాలకృష్ణతో పాటు నిర్వాహకులు, డీజే యజమానిపై కేసు నమోదు చేసినట్లు టూటౌన్ సీఐ నాగార్జున మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎలాంటి అనుమతి లేకుండా భారీ సౌండ్‌తో డీజే ఏర్పాటు చేసి నడిరోడ్డుపై గంటపాటు ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించడంతో ప్రజలు ఇబ్బందులు పడిన విషయం తెలిసిందే. దీంతో అధికారుల ఉత్తర్వులను ఉల్లంఘించి ప్రజా శాంతికి భంగం కలిగించే విధంగా ప్రవర్తించినందుకు కేసు నమోదు చేశామని సీఐ పేర్కొన్నారు.

చెక్ బౌన్స్ కేసులో ఆరు నెలలు జైలుశిక్ష

చివ్వెంల(సూర్యాపేట): చెక్ బౌన్స్ కేసులో వ్యక్తికి ఆరు నెలలు జైలుశిక్ష విధిస్తూ కింది కోర్టు ఇచ్చిన తీర్పును మంగళవారం సూర్యాపేట జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎస్. గోవర్ధన్‌రెడ్డి అమలు చేశారు. నూతనకల్ మండలం మద్దిరాల గ్రామానికి చెందిన వడ్డానం రవీందర్ వద్ద మునగాల మండలం గుంపుల మాదారం గ్రామానికి చెందిన కోదాటి బాలాజీప్రదీప్ 2014లో రూ.1.25లక్షలు అప్పుగా తీసుకున్నాడు. అప్పు తిరిగి చెల్లించే క్రమంలో అదే సంవత్సరం అక్టోబర్ నెలలో సంబంధిత నగదుకు సంబంధించి చెక్కును అందించాడు. రవీందర్ ఆ చెక్కును బ్యాంక్‌లో వేయగా ఆ అకౌంట్‌లో డబ్బు లేకపోవడంతో బౌన్స్ అయ్యింది. దీంతో రవీందర్ కోర్టును ఆశ్రయించాడు. పలువురు సాక్షులను విచారించిన సూర్యాపేట జిల్లా కోర్టు ప్రిన్సిపల్ జ్యూడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ 2022లో బాలాజీప్రదీప్‌కు ఆరు నెలల జైలు శిక్ష విధిస్తూ వడ్డీతో సహా రూ.2.50వేలు చెల్లించాలని తీర్పు వెలువరించారు. ఈ తీర్పును సవాల్ చేస్తూ బాలాజీప్రదీప్ జిల్లా కోర్టును ఆశ్రయించాడు. పలువురు సాక్షులను విచారించిన జిల్లా ప్రధాన న్యాయమూర్తి అప్పీల్‌ను తిరస్కరిస్తూ కింది కోర్టు ఇచ్చిన తీర్పును అమలు చేశారు.

అప్పులు తీర్చేందుకు దొంగతనాలు

- వృద్ధురాలిపై దాడి చేసి నగలు ఎత్తుకెళ్లిన నిందితుల అరెస్ట్
- నిందితులు నల్లగొండ, సూర్యాపేట జిల్లా వాసులు

ఇబ్రహీంపట్నం: జల్సాలు, బెట్టింగ్‌లకు అలవాటుపడి అప్పులు చేసి.. వాటిని తీర్చేందుకు చోరీలకు పాల్పడుతున్న ఇద్దరు యువకులను పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం ఏసీపీ కేవీపీ రాజు మంగళవారం వెల్లడించారు. సూర్యాపేట జిల్లా జాజిరెడ్డిగూడెం మండలం రామన్నగూడెం గ్రామానికి చెందిన బీటెక్ థర్డ్ ఇయర్ విద్యార్థి ఊట్కూరి ప్రభాస్ రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్ మండలం పెద్దఅంబర్‌పేట్ పరిధిలోని మైత్రి లహరి కాలనీలో నివాసం ఉంటున్నాడు. అతడికి నల్లగొండ జిల్లా శాలిగౌరారం మండల కేంద్రానికి గుండ్లపల్లి శివతో ఇన్‌స్టాగామ్‌లో ఏర్పడిన పరిచయం స్నేహంగా మారింది. వీరిద్దరు జల్సాలు, ఆన్‌లైన్ బెట్టింగ్‌లకు పాల్పడి అప్పులపాలయ్యారు. వీటిని తీర్చేందుకు చోరీలు చేయాలని నిర్ణయించుకున్నారు. ఈ నెల 10న రంగారెడ్డి జిల్లా కొహెడ గ్రామంలో ఓ కారును అద్దెకు తీసుకుని కందుకూరు మండలం ఆకులమైలారం గ్రామంలో ఒంటరిగా ఉంటున్న దేవరశెట్టి సమతమ్మ అనే వృద్ధురాలి ఇంట్లోకి ప్రవేశించారు. ఆమె నోరు మూసి, మెడలోని బంగారు పుస్తెలతాడు, చేతులకు ఉన్న బంగారు గాజులు లాక్కొని పారిపోయారు. ఆమె వెంటనే డయల్ 100కు సమాచారం ఇవ్వగా డీసీపీ సునీతారెడ్డి ఆదేశాల మేరకు ఏసీపీ పరిధిలోని ఆరు స్టేషన్ల క్రైం సిబ్బందిని అప్రమత్తం చేసి గాలింపు చర్యలు చేపట్టారు. కారు కోహెడ గ్రామానికి చెందిన వ్యక్తిదిగా గుర్తించి దర్యాప్తు చేపట్టిన పోలీసులు ప్రభాస్, శివను అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి ఆరుతులాల పుస్తెలతాడు, నాలుగు తులాల బంగారు గాజులతో పాటు కారు, కత్తెర, ఐఫోన్ స్వాధీనం చేసుకున్నారు.

పురుగుల మందు తాగి యువకుడి ఆత్మహత్య


శివ (ఫైల్)

మునుగోడు: కూల్‌డ్రింక్‌లో పురుగుల మందు కలుపుకొని తాగి యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన మంగళవారం మునుగోడులో జరిగింది. మునుగోడు పట్టణానికి చెందిన యరసాని వీరయ్య పెద్ద కుమారుడు యరసాని శివ(24) డిగ్రీ వరకు చదువుకున్నాడు. రెండేళ్ల క్రితం వరకు ఫాస్ట్‌ఫుడ్ సెంటర్ నడిపి ఆ వ్యాపారం మానేసి ఖాళీగా ఉంటున్నాడు. మంగళవారం శివ తల్లిదండ్రులు బంధువుల శుభకార్యానికి వెళ్లగా.. మధ్యాహ్నం ఇంట్లో కూల్‌డ్రింక్ బాటిల్‌లో పురుగుల మందు కలుపుకొని తాగాడు. తండ్రి, అతడి తమ్ముడు ఎన్నిసార్లు ఫోన్ చేసినా ఫోన్ లిఫ్ట్ చేయలేదు. శివ తమ్ముడు ఇంటికి వచ్చి తలుపులు పగులగొట్టి లోపలికి వెళ్లి చూడగా శివ అప్పటికే మృతిచెంది ఉన్నాడు. శివ తన సెల్‌ఫోన్‌లో కాల్ డేటా మొత్తం డిలీట్ చేసి ఉందని అతడి తమ్ముడు పేర్కొన్నాడు. శివ ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదు. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నల్లగొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడి కుటుంబ సభ్యుల నుంచి ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

మద్యానికి బానిసై హమాలీ కార్మికుడు..

చిట్యాల: మద్యానికి బానిసైన వ్యక్తి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన చిట్యాల మండలం వనిపాలక గ్రామంలో సోమవారం రాత్రి జరిగింది. వనిపాకల గ్రామానికి చెందిన హమాలీ కార్మికుడు మల్లెబోయిన నర్సింహ(43) కొంతకాలంగా మద్యానికి బానిసయ్యాడు. భార్య పద్మ, ఇద్దరు కుమారులను వదిలిపెట్టి గ్రామంలోని తన తల్లి బుచ్చమ్మ వద్ద ఉంటున్నాడు. సోమవారం బుచ్చమ్మ కూలీ పనులకు వెళ్లగా.. ఇంట్లో నర్సింహ ఉరేసుకున్నాడు. సాయంత్రం ఇంటికి వచ్చిన బుచ్చమ్మ నర్సింహహ ఉరేసుకోవడం చూసి చుట్టుపక్కల వాళ్లకు తెలపడంతో వారు వచ్చి కిందకు దింపారు. అప్పటికే నర్సింహ మృతిచెందాడు. మృతుడి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.



శ్రీ యల్లమ్మ అమ్మవారి దేవస్థానము

దేవాదాయ - ధర్మాదాయ శాఖ
గ్రా॥ దర్వేశిపురం (పర్వతగిరి), మం॥ కనగల్, జిల్లా॥ నల్లగొండ

టెండర్ కం - బహిరంగ వేలము ప్రకటన — తేది. 10.10.2024

ఇందుమూలముగా సమస్త ప్రజలకు తెలియజేయునది ఏమనగా పై దేవస్థానము వద్ద తేది. 25.10.2024 శుక్రవారం రోజున మ॥గం॥ 1-00ల నుండి ఈ క్రింద పేర్కొనబడిన వేలములు 2025-2026 (1) సం॥నకు దేవాదాయ, ధర్మాదాయ శాఖ అధికారుల సమక్షంలో టెండరు కం-బహిరంగ వేలములు జరుపబడును. ఆసక్తిగలవారు పాటలో పాల్గొనవలసిందిగా కోరనైనది.

క్ర. సం.	వేలము వివరములు	కాల పరిమితి 1 సం॥	డిపాజిట్ డబ్బు	టెండర్ షెడ్యూల ధర	రిమార్క్స్
1	కొబ్బరికాయలు అమ్ముకొను హక్కు	తేది.1.01.2025 నుండి తేది.31.12.2025 వరకు	10,00,000-00	2000-00	[illegible]
2	లడ్డు, పులిహోర అమ్ముకొను హక్కు	తేది.1.01.2025 నుండి తేది.31.12.2025 వరకు	2,00,000-00	1000-00	
3	పూలు, పండ్లు అమ్ముకొను హక్కు	తేది.1.01.2025 నుండి తేది.31.12.2025 వరకు	2,00,000-00	1000-00	
4	గాజులు & కిరాణం మానిటర్ షాప్	తేది.1.01.2025 నుండి తేది.31.12.2025 వరకు	1,00,000-00	1000-00	
5	మిఠాయి అమ్ముకొను హక్కు	తేది.1.01.2025 నుండి తేది.31.12.2025 వరకు	50,000-00	500-00	
6	దేవస్థానము వద్ద ఫోటోలు తీయుటకు	తేది.1.01.2025 నుండి తేది.31.12.2025 వరకు	20,000-00	500-00	

నోట్ : డిపాజిట్ డి.డి.లు మాత్రమే స్వీకరించబడును. డి.డి.లు కార్యనిర్వహణాధికారి శ్రీ యల్లమ్మ దేవస్థానము, గ్రా॥ దర్వేశిపురం పేరుమీద తీయవలెను.

శ్రీమతి అన్నెపర్తి సులోచన, సహాయ కమీషనర్ దేవాదాయ ధర్మాదాయ శాఖ, నల్లగొండ — గ్రామ పెద్దలు — శ్రీ జల్లేపల్లి జయరామయ్య, కార్యనిర్వహణాధికారి, సెల్ : 9951999438

వివరాలకు సంప్రదించవలసిన ఫోన్ నెం. 90000 10884, 9949609848

పోలీస్ కస్టడీలో తహసీల్దార్, కంప్యూటర్ ఆపరేటర్

హుజూర్‌నగర్: అవినీతి ఆరోపణలతో అరెస్టై జైలులో ఉన్న గతంలో హుజూర్‌నగర్‌లో పనిచేసిన తహసీల్దార్ జయశ్రీ, కంప్యూటర్ ఆపరేటర్ జగదీష్‌ను మంగళవారం హుజూర్‌నగర్ పట్టణంలోని సీఐ కార్యాలయంలో పోలీసులు విచారించారు. తహసీల్దార్ ఆరోగ్య పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని పోలీస్ అధికారులు ఉదయం నుంచి సాయంత్రం వరకు విచారించినట్లు తెలిసింది. మరో రెండు రోజులు వారిని విచారించాల్సి ఉన్నందున్న రాత్రి పోలీస్ స్టేషన్‌లోనే ఉంచనున్నట్లు సమాచారం.

అదుపుతప్పి కారు బోల్తా.. యువకుడి మృతి

యాదగిరిగుట్ట రూరల్: కారు అదుపుతప్పి బోల్తా పడడంతో యువకుడు మృతి చెందాడు. ఈ ఘటన యాదగిరిగుట్ట మండలం పెద్దకందుకూరు గ్రామ స్టేజీ సమీపంలో హైదరాబాద్–వరంగల్ జాతీయ రహదారిపై సోమవారం అర్ధరాత్రి జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వరంగల్ జిల్లా పర్వతగిరి మండలం దౌలత్‌గర్ గ్రామానికి చెందిన వీరమల్లు వినీత్ (17), మరో నలుగురు కలిసి వరంగల్ నుంచి హైదరాబాద్‌కు కారులో బయల్దేరారు. సోమవారం అర్ధరాత్రి యాదగిరిగుట్ట మండలం పెద్దకందుకూరు సమీపంలోకి రాగానే కారు అదుపుతప్పి బోల్తా పడింది. దీంతో కారులో ఉన్న వీరమల్లు వినీత్ అక్కడికక్కడే మృతిచెందాడు. కారులోని మిగతా యువకులకు స్వల్ప గాయాలయ్యాయి. కారు నడిపింది వినీత్ స్నేహితుడు ఎండీ అంకుష్ అని పోలీసులు పేర్కొన్నారు. మృతుడి తండ్రి భిక్షపతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ రమేష్ తెలిపారు.

గొంతు నొప్పి భరించలేక ఇంటర్ విద్యార్థి బలవన్మరణం


సుధాకర్ (ఫైల్)

కొండమల్లేపల్లి: గొంతు నొప్పి భరించలేక ఇంటర్ విద్యార్థి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన సోమవారం సాయంత్రం కొండమల్లేపల్లి మండల కేంద్రంలో జరిగింది. మంగళవారం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కొండమల్లేపల్లి మండల కేంద్రంలోని సాగర్ రోడ్డులో నివాసముంటున్న కేతావత్ నర్సింహ, నారింగ దంపతుల కుమారుడు సుధాకర్(17) స్థానికంగా ఓ ప్రైవేట్ కళాశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరం చదువుతున్నాడు. సుధాకర్ గత నాలుగు సంవత్సరాలుగా గొంతు నొప్పితో బాధపడుతున్నాడు. వైద్యుడిని సంప్రదించినా ఫలితం లేకపోవడంతో తీవ్ర మనోవేదనకు గురయ్యాడు. ఈ క్రమంలోనే సోమవారం సాయంత్రం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం దేవరకొండ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు ఏఎస్ఐ తెలిపారు.

గుప్త నిధుల కోసం తవ్వకాలు..?

- పోలీసులకు ఫిర్యాదు చేసిన జేత్యతండావాసులు


బండరాళ్లకు ఉన్న విగ్రహాలను కూల్చివేశారని చూపుతున్న తండావాసులు

కొండమల్లేపల్లి: మండలంలోని చింతచెట్టుతండా గ్రామ పంచాయతీ పరిధిలోని జేత్యతండాలో గుప్త నిధుల కోసం తవ్వకాలు జరిపిన ఉదంతం మంగళవారం వెలుగులోకి వచ్చింది. తండావాసులు తెలిపిన వివరాల ప్రకారం.. జేత్యతండా పరిధిలోని సర్వే నంబర్ 19లో సుమారు 110 ఎకరాల పట్టా భూములు ఉన్నాయి. అందులోని 15 ఎకరాలను తండాకు చెందిన ముగ్గురు వ్యక్తుల నుంచి ఐదేళ్ల క్రితం ఆంధ్రా ప్రాంతానికి చెందిన ఓ రియల్ వ్యాపారి కొనుగోలు చేశాడు. అందులో గల వీరన్న గుట్టపై బండలపై వీరన్న, మల్లన్న, ఆంజనేయస్వామి విగ్రహాలు ఉన్నాయి. చింతచెట్టుతండా, జేత్యతండా, పూల్‌సింగ్‌తండాలకు చెందిన గిరిజనులు గత 40 సంవత్సరాలుగా తమ ఇళ్లల్లో జరిగే శుభకార్యాలకు అక్కడికి వచ్చి పూజలు చేసేవారు. ఆ భూమిని కొనుగోలు చేసిన రియల్ వ్యాపారి గుట్ట చుట్టూ ఫ్రీ కాస్ట్ ఇటుకలతో ప్రహరీ ఏర్పాటు చేసి తండావాసులను అక్కడికి రాకుండా చేశాడు. రెండు నెలలుగా పెద్ద పెద్ద హిటాచీలు, జేసీబీలతో రాత్రివేళ గుట్టను తవ్వి 30 అడుగుల వెడల్పు, 50 అడుగుల లోతు మేర బొయ్యారం చేశాడు. అక్కడి పరిసరాలను పరిశీలిస్తే గుప్త నిధుల కోసం తవ్వినట్లు తెలుస్తోందని తండావాసులు ఆరోపిస్తున్నారు.

దసరా పండుగకు వెళ్లడంతో వెలుగులోకి..

మూడు రోజుల క్రితం దసరా పండుగ సందర్భంగా తండావాసులు పూజల కోసం వీరన్న గుట్ట వద్దకు వెళ్లగా రియల్ వ్యాపారి వారిని గుట్ట వద్దకు రానివ్వలేదు. లోపలికి వెళ్లి చూడగా పెద్ద పెద్ద గుంతలు, బొయ్యారం కనిపించడంతో తండావాసులు గుంతలను ఎందుకు తవ్వారని రియల్ వ్యాపారిని ప్రశ్నించగా పొంతన లేని సమాధానాలు చెప్పారు. మంగళవారం సదరు రియల్ వ్యాపారులను మూకుమ్మడిగా నిలదీయగా గుడి కట్టిస్తానని తెలిపినట్లు తండావాసులు పేర్కొన్నారు. దీంతో తండావాసులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి వివరాలు సేకరించారు. తండావాసుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఇన్‌చార్జ్ ఎస్ఐ అజ్మీర రమేష్ తెలిపారు.

డీసీఎంను ఢీకొని యువతి మృతి

కోదాడరూరల్: స్కూటీపై రాంగ్‌రూట్‌లో వెళ్తున్న యువతి డీసీఎంను ఢీకొని మృతిచెందింది. ఈ ఘటన కోదాడ పట్టణ పరిధిలోని హుజూర్‌నగర్ ఫ్లెఓవర్‌పై సోమవారం రాత్రి జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కోదాడ పట్టణంలోని నయానగర్‌కు చెందిన పలివెల కవిత పెద్ద కుమార్తె నాగజ్యోతి(18) ఇంటర్మీడియట్ చదువుతోంది. సోమవారం రాత్రి తెలిసిన వారి స్కూటీపై హుజూర్‌నగర్ ఫ్లెఓవర్‌పై విజయవాడ వైపు రాంగ్‌రూట్‌లో వెళ్తూ ఎదురుగా వస్తున్న డీసీఎంను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆమెకు తీవ్రగాయాలు కావడంతో అక్కడికక్కడే మృతిచెందింది. మృతురాలి తల్లి కవిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రంజిత్‌రెడ్డి తెలిపారు. ఆత్మహత్య చేసుకునేందుకే యువతి రాంగ్‌రూట్‌లో వెళ్లి డీసీఎంను ఢీకొట్టిందా అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నారు.

ఎర్రవరం పీఏసీఎస్‌లో ఏం జరుగుతోంది..!

- సిబ్బంది నిర్లక్ష్యంతో 66మంది రైతులకు అందని రుణమాఫీ
- సీఈఓ, కంప్యూటర్ ఆపరేటర్‌ను సస్పెండ్ చేసిన చైర్మన్, కొందరు డైరెక్టర్లు
- చైర్మన్ అవినీతికి పాల్పడ్డాడని డీసీఓకు ఫిర్యాదు చేసిన సీఈఓ
- ఇటీవల జరిగిన సర్వసభ్య సమావేశంలో చైర్మన్ అవినీతిని నిలదీసిన సంఘం సభ్యులు



ఎర్రవరం పీఏసీఎస్ కార్యాలయం

కోదాడరూరల్: కోదాడ మండలంలోని ఎర్రవరం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో అవినీతి ఆరోపణలు ప్రకంపనలు రేపుతున్నాయి. పీఏసీఎస్ పరిధిలోని పలువురు రైతులకు ప్రభుత్వ ప్రకటించిన రుణమాఫీ కాలేదు. పీఏసీఎస్ సిబ్బంది రైతుల వివరాలు పంపకపోవడంతోనే రుణమాఫీ కాలేదని ఇటీవల సీఈఓ, కంప్యూటర్ ఆపరేటర్‌ను సస్పెండ్ చేశారు. అయితే పీఏసీఎస్ చైర్మన్ అవినీతికి పాల్పడ్డాడని సస్పెండైన సీఈఓ ఆరోపిస్తున్నాడు. సోమవారం నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో ఇదే విషయమై తీవ్ర ఉద్రిక్తత చోటుచేసుకోవడంతో పోలీసులు వచ్చి చైర్మన్‌ను అక్కడి నుంచి తరలించారు. ఈ విషయంలో కొందరు పీఏసీఎస్ డైరెక్టర్లు, రైతులు చైర్మన్‌కు మద్దతు తెలుపుతుండగా.. మరికొందరు సస్పెండైన సీఈఓ హుస్సేన్‌కు మద్దతుగా నిలుస్తున్నట్లు తెలుస్తోంది. ఎర్రవరం పీఏసీఎస్‌లో 1085 మంది రైతులు రుణాలు తీసుకుంటే 498 మంది రైతులకు మాత్రమే రుణమాఫీ అయినట్లు సమాచారం.

రుణమాఫీ కాకపోవడంతో మొదలైన ఆందోళన..

ఎర్రవరం పీఏసీఎస్ పరిధిలో లక్షన్నరలోపు రుణాలు తీసుకున్న కొందరు రైతులకు రుణమాఫీ కాలేదు. దీంతో రుణమాఫీ కాని రైతులు ఆగస్టు 3వ తేదీన పీఏసీఎస్ కార్యాలయానికి వెళ్లి ఆరా తీయగా 66మంది రైతుల వివరాలను అధికారులకు ప్రభుత్వానికి పంపనట్లు తెలిసింది. దీంతో సదరు రైతులు పెద్దఎత్తున ఆందోళన చేయడంతో అదే నెల 9న జిల్లా సహకార బ్యాంకు అధికారులు వచ్చి సంఘ సభ్యులతో సమావేశం ఏర్పాటుచేసి అదే నెల చివరి వరకు రైతుల వివరాలను ఆన్‌లైన్ చేసి వివరణ ఇవ్వాలని సీఈఓ హుస్సేన్‌ను కోరారు. సీఈఓ సెప్టెంబర్ మొదటి వారం వరకు కూడా వివరణ ఇవ్వకపోవడంతో అదే నెల 17న పీఏసీఎస్ చైర్మన్ కొందరు డైరెక్టర్లతో సమావేశం ఏర్పాటు చేసి డీసీఓ ఆదేశాలకు మేరకు సీఈఓ హుస్సేన్, కంప్యూటర్ ఆపరేటర్‌ను సస్పెండ్ చేస్తున్నట్లు ప్రకటించారు. సస్పెండైనప్పటికీ సీఈఓ హుస్సేన్ వారం వరకు విధుల్లోనే ఉన్నాడు. మరికొందరు డైరెక్టర్లు కలిసి సమావేశం ఏర్పాటు చేసి సీఈఓను తొలగించేదిలేదని తీర్మానం చేశారు.

చైర్మన్‌పై డీసీఓకు ఫిర్యాదు చేసిన సీఈఓ..

సస్పెండైన సీఈఓ హుస్సేన్ చైర్మన్ అవినీతి, అక్రమాలకు తాను సహకరించడంలేదని కావాలనే తనను సస్పెండ్ చేశారని డీసీఓకు నాలుగు పేజీల లేఖ రాశారు. చైర్మన్ అతడి భార్యపై రూ.25లక్షల గోల్డ్‌లోన్ తీసుకొని వడ్డీ కట్టకుండా, రెన్యూవల్ చేయకుండా డీఫాల్టర్ అయ్యాడని, అదేవిధంగా గోల్డ్ తూకం వేసే మిషన్ రూ.9వేలు కాగా రూ.30వేలు బిల్లు డ్రా చేసుకున్నాడని లేఖలో పేర్కొన్నాడు. సంఘంలోని రూ.8లక్షలను అనమాతు కింద వాడుకొని కట్టడం లేదని, ధాన్యం గోదాం నిర్మాణంలో రూ.4లక్షలకు దొంగ ఎంబీని తయారుచేసి నిధులు కాజేయాలని చూడగా ఎంసీ, జీబీ సభ్యులు ఒప్పుకోలేదని లేఖలో వివరించారు. అదేవిధంగా పీఏసీఎస్ ఆధ్వర్యంలో పెట్రోల్ బంక్ నిర్మాణం చేపడదామని రెండేళ్ల కిందట ఓ కంపెనీకి రూ.2.25లక్షలను ఇచ్చి ఎలాంటి పనులు చేపట్టలేదని, పంట రుణాల విషయంలో తనకు గిట్టని వారికి సంతకం పెట్టకుండా రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నాడని, అంతేకాకుండా పలు పనులకు అవసరాలకు మించి సంఘం డబ్బును చైర్మన్ వాడుకున్నాడని ఆయన లేఖలో పేర్కొన్నారు. ఇవే ఆరోపణలపై సోమవారం జరిగిన పీఏసీఎస్ సర్వసభ్య సమావేశంలో రైతులు, సంఘ సభ్యులు చైర్మన్‌ను నిలదీశారు. అయితే సీఈఓ డీసీఓకు ఫిర్యాదు చేసిన తర్వాత అనామతు కింద తీసుకున్న రూ.8లక్షల్లో రూ.4లక్షలను చెల్లించడంతో పాటు గోల్డ్ లోన్‌ను పెంచి చైర్మన్ రెన్యూవల్ చేసుకున్నట్లు సిబ్బంది తెలిపారు.

తాత్కాలిక సీఈఓ నియామకం

సెప్టెంబర్ 24న సంఘంలో సీనియర్ క్లర్క్‌గా పనిచేస్తున్న మౌలాలిని సీఈఓగా, నీరజ్‌కుమార్‌ను, కంప్యూటర్ ఆపరేటర్‌గా నియమిస్తూ తీర్మానం చేయగా ప్రస్తుతం వారే విధుల్లో కొనసాగుతున్నారు. ఇది ఇలా ఉంటే ఇన్ని సంవత్సరాలు ప్రశాంతంగా ఉన్న సంఘంలో ఇలా గొడవలు చేసుకోవడం ఏంటని ఇప్పటికైనా గొడవలను పరిష్కరించి తిరిగి పీఏసీఎస్‌ను అభివృద్ధి పథంలో నడిచే విధంగా చూడాలని సంఘ పరిధిలోని ఎర్రవరంతో పాటు రామలక్ష్మీపురం, బీక్యాతండా గ్రామాల రైతులు కోరుతున్నారు.